www.eenadupratibha.net

# BOARD OF INTERMEDIATE EDUCATION

# Jr. INTER TELUGU

# MODEL PAPER

## PART -II

**TIME: 3 HOURS** **Max. Marks: 100**

సూచన: ప్రశ్నపత్రం ప్రకారం సమాధానాలను వరుస క్రమంలో రాయాలి. 1 × 6 = 6

**I. కింది పద్యాల్లో ఒకదానిని పాదభంగం లేకుండా పూరించి, ఆ పద్యానికి భావం రాయండి.**

1. చోద్యం బయ్యెడి ........... దాత్పర్యంబు భాషింపుమా
2. ఒకచో నేలను ................ సుఖంబున్ మదిన్

**II. కింది ప్రశ్నల్లో ఒకదానికి 25 పంక్తుల్లో సమాధానం రాయండి. 1 × 8 = 8**

1. సజ్జనుల లక్షణాలు, పరోపకార పద్ధతిని తెలపండి?
2. ప్రహ్లాదుని విద్యాభ్యాస వృత్తాంతాన్ని వివరించండి.

**III. కింది ప్రశ్నల్లో ఒక దానికి 25 పంక్తుల్లో సమాధానం రాయండి. 1 × 8 = 8**

1. పులి - కంకణం - బాటసారి కథను రాయండి?
2. పాల్కురికి సోమన జీవిత విశేషాలను, కవితా గుణాలను వివరించండి.

**IV. కిందివాటిలో ఏదైనా ఒక ప్రశ్నకు 25 పంక్తుల్లో సమాధానం రాయండి. 1 × 8 = 8**

1. 'శబ్దసందేశం'లో నాగమణి కుటుంబాన్ని విడిచి, జెడ్డా వెళ్లడానికి గల ఆర్థిక పరిస్థితులను రాయండి.
2. 'పల్లెబడి' కథలోని ఉపాధ్యాయుడి పాత్రను వివరించండి.

**V. కిందివాటిలో ఏవైనా రెండింటికి సందర్భ సహిత వ్యాఖ్యలను రాయండి. 2 × 3 = 6**

1. హాయిమీర నెమరువేయుచుండె
2. పురోడాశమిది కుక్కకర్హమగునే
3. చదువులలో మర్మమెల్ల చదివితి తండ్రి
4. రేపు పూసే చిగురుకి, సరికొత్త ఊపిరివి

**VI. కిందివాటిలో ఏవైనా రెండింటికి సందర్భ సహిత వ్యాఖ్యలను రాయండి? 2 × 3 = 6**

1. ఆహా! అదియెంత గొప్ప శాస్త్రము?
2. కొఱవిమాలిన శంకలు తెచ్చుకొని భోజనమును మానుకొనవచ్చునా?
3. తెలుగులో చదవడమేమిటని ముక్కు విరిస్తే ప్రయోజనం లేదు.
4. కంపెనీ ఏదీ పెట్టనూ లేదు. అది దివాళా తియ్యనూలేదు.

**VII. కిందివాటిలో ఏవైనా రెండింటికి సంక్షిప్త సమాధానాలు రాయండి.** **2 × 2 = 4**

1. కర్ణుని అవమానాన్ని దుర్యోధనుడు ఎలా తొలగించాడు?
2. పోతన కవితారీతులను సమీక్షించండి?
3. మిత్రుడి లక్షణాలను తెలపండి.
4. తోకచుక్కను గురజాడ భావించిన విధమును తెలపండి?

**VIII. కిందివాటిలో ఏవైనా రెండింటికి సంక్షిప్త సమాధానాలు రాయండి.** **2 × 2 = 4**

1. దుఃఖభాగులెవరు?
2. ఆంధ్రమహిళా సభను గురించి వివరించండి?
3. ఆ రోజుల్లో రాత్రి ప్రయాణానికి తీసుకునే జాగ్రత్తలేమిటి?
4. గడియారం వారి సాహిత్య సేవను వివరించండి?

**IX. కిందివాటిలో ఒకదాన్ని గురించి లేఖ రాయండి.** **1 × 5 = 5**

1. ఉద్యోగం కోసం కలెక్టరుకో లేఖ.
2. నీ చదువును గురించి నీ తల్లిదండ్రులకు లేఖ.

**X. కిందివాటిలో ఏవైనా నాలుగింటిని విడదీసి సంధి పేర్లు, సూత్రాలు రాయండి.** **4 × 3 = 12**

| | | | |
|---|---|---|---|
| 1. దేవాలయము | 2. హితోక్తి | 3. వనౌషధి | 4. అభ్యుదయము |
| 5. ఒకానొక | 6. మఱేమి | 7. రారుగదా | 8. మీయిల్లు |

**XI. కిందివాటిలో ఏవైనా నాలుగింటికి విగ్రహవాక్యాలు రాసి, అవి ఏ సమాసాలో పేర్కొనండి?**

**4 × 2 = 8**

| | | | |
|---|---|---|---|
| 1. మధురవచనం | 2. ముల్లోకములు | 3. నెలతాల్పు | 4. దొంగభయము |
| 5. పాదపద్మము | 6. చిగురుకేలు | 7. విద్యాధికుడు | 8. వింధ్యపర్వతం |

**XII. కిందివాటిలో ఏవైనా అయిదింటికి సొంత వాక్యాలు రాయండి.** **1 × 5 = 5**

| | | | |
|---|---|---|---|
| 1. తలవంచుకొను | 2. పరోపకారము | 3. విద్యాబుద్ధులు | 4. కొఱమాలిన |
| 5. ప్రత్యక్షం | 6. మతిభ్రమణం | 7. అనర్గళం | 8. స్వర్గసుఖంబులు |
| 9. గాఢాలింగనం | 10. అన్నవస్త్రాలు | | |

**XIII. కిందివాటిలో ఒక దాన్ని గురించి వ్యాసం రాయండి.** **1 × 5 = 5**

1. పర్యావరణం - పరిరక్షణ
2. మాతృభాష - తెలుగు
3. నీకు నచ్చిన కవి

www.eenadupratibha.net

**XIV. కింది ఆంగ్ల వాక్యాలను తెలుగులోనికి అనువదించండి** **5 × 1 = 5**

1. Take care of your health.
2. Never try to board a running bus.
3. Mahatma Gandhi was born at Porbundar.
4. Writing was known in India over 4,000 years ago.
5. Some students came late to the class.

**(లేదా)**

**కింది పేరాను చదివి, ప్రశ్నలకు సమాధానాలను రాయండి.**

ఓన గుంటలు ఆటను ఓమన గుంటలు, వామన గుంటలు అనికూడా అంటారు. ప్రాచీన కావ్యాల్లో కూడా ఈ ఆటను గురించిన ప్రస్తావనలు కనిపిస్తాయి. దక్షిణ భారతమంతా ఈ ఆట వాడుకలో ఉంది. ఓన గుంటలు ఆటను ఇద్దరు లేదా ముగ్గురు ఆడవచ్చు. ఓన గుంటలు పీటను చెక్కతో చేస్తారు. ఇది పొడవుగా ఉండి రెండుగా విభజించడానికి, తెరవడానికి, మూయడానికి వీలుగా ఉంటుంది. ఈ ఆటలో చింత గింజలు లేదా కుంకుడు గింజలను ఉపయోగిస్తారు. పీటలో ఉన్న చిన్న చిన్న గుంటలను ఇళ్లు అని కూడా వ్యవహరిస్తారు. రెండువైపులా ఏడు చొప్పున 14 గుంటలుంటాయి.

ప్రశ్నలు

**1.** ప్రాచీన కావ్యాల్లో ఏ ఆటను గురించి ప్రస్తావించారు?

**2.** ఓన గుంటలు ఆటను ఎందరు ఆడవచ్చు?

**3.** ఓన గుంటలు పీటను దేనితో తయారు చేస్తారు?

**4.** ఓన గుంటలు పీటలో ఎన్ని గుంటలుంటాయి?

**5.** ఓన గుంటలు ఆటను ఏ గింజలతో ఆడతారు?

**XV. కింది ప్రశ్నలకు సరైన సమాధానాలను గుర్తించండి** **5 × 1 = 5**

**1.** 'ప్రహ్లాదుని విద్యాభ్యాసము' పాఠ్యాంశం ఏ గ్రంథంలోనిది?

అ) వాల్మీకి రామయాణము ఆ) సుభాషిత రత్నావళి

ఇ) శ్రీమదాంధ్ర భాగవతం ఈ) శ్రీమదాంధ్ర మహాభారతం

**2.** ఏనుగు లక్ష్మణ కవి రచించిన గ్రంథం

అ) మహాప్రస్థానం ఆ) సూర్యశతకం ఇ) విశ్వంభర ఈ) ముత్యాలసరాలు

**3.** గురజాడ జన్మించిన సంవత్సరం

అ) 1910 ఆ) 1862 ఇ) 1890 ఈ) 1905

**4.** 'సంక్రాంతి' ఖండిక రచయిత

అ) జాషువా ఆ) శ్రీశ్రీ ఇ) సి. నారాయణరెడ్డి ఈ) గడియారం

5. 'హితోపదేశము'ను రచించిన వారు

అ) నారాయణ పండితుడు ఆ) చిన్నయసూరి

ఇ) విష్ణుశర్మ ఈ) అర్బత్‌నాట్

**XVI. కింది వాటిని జతపరచండి** **5 × 1 = 5**

a) మిత్రలాభము ( ) అ) తిరుమల రామచంద్ర

b) శారదలేఖలు ( ) ఆ) అందె వేంకటరాజము

c) శబ్దసందేశం ( ) ఇ) పరవస్తు చిన్నయసూరి

d) రోడ్డుకు అడ్డంగా పడుకున్న పులి ( ) ఈ) కనుమర్తి వరలక్ష్మమ్మ

e) మన తెలుగు ( ) ఉ) మధురాంతకం రాజారాం

www.eenadupratibha.net
www.eenadupratibha.net

# సమాధానాలు

**I. కింది పద్యాల్లో ఒకదానిని పాదభంగం లేకుండా పూరించి, ఆ పద్యానికి భావం రాయండి.**

1 × 6 = 6

**1. చోద్యం బయ్యెడి ........... దాత్పర్యంబు భాషింపుమా**

**2. ఒకచో నేలను ............... సుఖంబున్ మదిన్**

1. చోద్యం బయ్యెడి నింతకాల మరిగెన్ శోధించియేమిమిసం
వేద్యాంశంబులు సెప్పిరో గురువు లేవెంటం బఠింపించిరో
విద్యాసార మెఱుంగఁ గోరెద భవద్విజ్ఞాత శాస్త్రంబు లోఁ
బద్యం బొక్కటి సెప్పి సార్థముగాఁ దాత్పర్యంబు భాషింపుమా

భావం: 'నాయనా! ఆశ్చర్యం వేస్తోంది. నీవు విద్యాభ్యాసానికి వెళ్లి చాలాకాలం అయింది. మీ గురువులు పరిశోధించి తెలుసుకోదగిన ఏయే విషయాలు చెప్పారో? ఏ పద్ధతిగా నిన్ను చదివించారో? నీ చదువుల సారాన్ని తెలుసుకోవాలని నాకు కోరికగా ఉంది. కాబట్టి, నీకు తెలిసిన శాస్త్రంలో ఒక పద్యాన్ని చదివి, దానికి అర్థాన్ని, తాత్పర్యాన్ని కూడా చెప్పు' అని హిరణ్యకశిపుడు ప్రహ్లాద కుమారుడిని అడిగాడు.

2. ఒకచో నేలను బవ్వళించు, నొకచో నొప్పారుఁబూసెజ్జపై
నొకచో శాకములారగించు, నొకచో నుత్కృష్ట శాల్యోదనం
బొకచో బొంత ధరించు, నొక్కక తఱిన్ యోగ్యాంబర శ్రేణి, లె
క్కకు రానీయఁడు కార్యసాధకుడు దుఃఖంబున్ సుఖంబున్ మదిన్

భావం: కార్యసాధకుడు వీలుననుసరించి ఒకచోట నేలపై పడుకుంటాడు. ఒకచోట పూలపాన్పుపై నిద్రిస్తాడు. ఒక్కొక్క చోట కూరగాయలను తింటాడు. ఒకచోట వరియన్నమును ఆరగిస్తాడు. ఒకచోట బొంతను కట్టుకుంటాడు. ఒకచోట శ్రేష్ఠమైన వస్త్రాలు ధరిస్తాడు. అతడు సుఖదుఃఖములను లెక్కచేయడు.

**II. కిందివాటిలో ఏదైనా ఒక ప్రశ్నకు 25 పంక్తుల్లో సమాధానం రాయండి? 1 × 8 = 8**

**1. సజ్జనుల లక్షణాలు, పరోపకార పద్ధతిని తెలపండి?**

**జ: సజ్జనుల లక్షణాలు:** సజ్జనులు ఉన్నత లక్షణాలు కలిగి, ఇతరులకు మార్గదర్శకులుగా ఉంటారు. ఆపదలు వచ్చినప్పుడు ధైర్యం, మంచి సంపదలు కలిగి ఉన్నప్పుడు ఓర్పు, రాజ సభామధ్యమున పుష్కలమైన వాక్చాతుర్యం, యుద్ధం వచ్చిన వేళ భుజశక్తి, కీర్తిని సంపాదించడంలో అనురాగం, విద్యార్జనలో కోరిక అనేవి వారికి సహజసిద్ధంగా కలిగే గుణాలు.

సజ్జనులనే సర్వత్రా ఆశ్రయించాలి. అందువల్ల మంచి ఫలితాలు కలుగుతాయి. నీటి బిందువు కాలిన ఇనుముపై పడితే నామరూపాలను కోల్పోతుంది. అదే నీటి బిందువు సముద్రంలో ముత్యపు చిప్పలో పడితే ముత్యమవుతుంది. కాబట్టి, సజ్జనులను ఆశ్రయించడం మంచిది.

**పరోపకార పద్ధతి:** వృక్షములు రసవంతమైన పండ్ల బరువును మోస్తూనే వాటిని ఇతరులకు అందిస్తాయి. మేఘుడు ఆకాశంలో వేలాడుతూ అమృతంలాంటి నీటిని వర్షిస్తాడు. పండితులు తమకు సమృద్ధిగా జ్ఞానముందని గర్వించరు. ఇది పరోపకారులకు సహజగుణం.

సజ్జనుడైన వ్యక్తి తన మిత్రుడిని పాపకార్యాల నుంచి రక్షిస్తాడు. మంచి కార్యాలు చేసేలా ప్రోత్సహిస్తాడు. రహస్యాలను కాపాడతాడు. సద్గుణాలను పెంచుతాడు. ఆపత్కాలంలో విడిచి పెట్టడు. లేని సమయంలో అవసరమైన దాన్ని సమకూర్చుతాడు.

**2. ప్రహ్లాదుని విద్యాభ్యాస వృత్తాంతాన్ని వివరించండి.**

జ. హిరణ్యకశిపుడు రాక్షసరాజు. విష్ణుద్వేషి. అతడి కుమారుడు ప్రహ్లాదుడు. చిన్నతనం నుంచి విష్ణుభక్తుడు. చదివిస్తే మంచి చెడులు తెలుస్తాయని భావించిన హిరణ్యకశిపుడు తన కుమారుడిని గురుపుత్రులైన చండామార్కులను అప్పగించి నీతికోవిదుణ్ణి చేయమన్నాడు. వారు ప్రహ్లాదునికి సర్వవిద్యలు నేర్పించారు. ప్రహ్లాదుడు గురువులు చెప్పినట్లే చదివాడు. కొంతకాలం తరువాత ప్రహ్లాదుని చదువును గురించి తెలుసుకోవాలనుకున్న తండ్రి అతడిని పిలిపించి, 'నీకు మంచి అనిపించిన విషయం చెప్పు' అని అడిగాడు. అందుకు ప్రహ్లాదుడు 'సర్వమూ భగవంతుని లీలావిలాసం అని తెలుసుకొని, విష్ణువును ధ్యానిస్తూ అడవిలో ఉండటం మంచిద'ని చెప్పాడు.

కొడుకు మాటలకు ఆశ్చర్యపడిన హిరణ్యకశిపుడు 'విష్ణుభక్తి నీకే కలిగిందా? లేక గురువులు ఎవరైనా చెప్పారా' అని ప్రశ్నిస్తాడు. 'హరి, గిరి అని చెడిపోకు' అని పుత్రుడికి హితవు పలికాడు. ప్రహ్లాదుడు ఇనుమును అయస్కాంతం ఆకర్షించిన విధంగా తన మనసు విష్ణువును ఆకర్షిస్తున్నదని, ఇతర విషయాల మీదకు దృష్టి పోవడంలేదని చెప్పాడు. గురుపుత్రులకు కోపం వచ్చి, తాము చెప్పిన విషయాలు తండ్రి ముందు చెప్పకపోవడం చేత తాము తలదించుకోవలసి వచ్చిందని కోపగించుకున్నారు.

ప్రహ్లాదుడిని భయపెట్టి చదివిస్తామని గురువులు రాజు పాదాలపై ఒట్టుపెట్టి, తమతో తీసుకువెళ్లారు. తిరిగి నీతులు చెప్పారు. ధర్మ, అర్థ, కామశాస్త్రాలు బోధించారు. సామదాన భేద దండోపాయాలతో నేర్పారు. అతడిని నీతి కోవిదుణ్ణి చేశారు. అనంతరం తండ్రి వద్దకు తీసుకువెళ్లారు. ముందుగానే అతడితో 'నాయనా! మేము చెప్పినదే మీ తండ్రిగారి వద్ద చెప్పు. విష్ణువును గురించి చెప్పవద్దు' అని సిద్ధం చేశారు. ప్రహ్లాదుడితో తండ్రి అయిన హిరణ్యకశిపునికి నమస్కారం చేయించారు. అన్నివిద్యలూ నేర్పామని, అతడి విద్యాబలాన్ని పరీక్షించమని కోరారు.

హిరణ్యకశిపుడు ప్రహ్లాదుణ్ణి అతడు చదివిన శాస్త్రంలో నుంచి ఒక పద్యాన్ని చదివి, అర్థ తాత్పర్యాలు చెప్పమన్నాడు. ప్రహ్లాదుడు తనకు గురువులు చక్కగా చదువు చెప్పారని, తాను అన్ని శాస్త్రాలనూ అభ్యసించానని, వాటిలోని మర్మాన్ని తెలుసుకున్నానని చెప్పాడు. విష్ణువును ప్రకటించేదే నిజమైన చదువు అని వివరించాడు. విష్ణుభక్తి లేని పండితుడు పశువుతో సమానమన్నాడు.

గురుపుత్రులు మోసం చేసి తన కుమారుడికి విష్ణుభక్తి నేర్పారని హిరణ్యకశిపుడు వారిపై కోపించాడు. గురుపుత్రులు తమ తప్పులేదనీ, ప్రహ్లాదుడికి అది పుట్టుకతో వచ్చిన బుద్ధి అనీ విన్నవించుకున్నారు.

**III. కిందివాటిలో ఏదైనా (ఒక) ప్రశ్నకు 25 పంక్తుల్లో సమాధానం రాయండి? 1 × 8 = 8**

**1. పులి–కంకణం–బాటసారి కథను రాయండి?**

జ. ఒక ముసలి పులి స్నానం చేసి దర్భలు చేతితో పట్టుకుని ఒక సరస్సు గట్టుమీద కూర్చుంది. అది ఆ దారిన పోతున్న ఒక బాటసారిని 'ఓ బాటసారీ! ఈ బంగారు కంకణాన్ని తీసుకో' అని పిలిచింది. ఆ బాటసారి పులి మాటలు విని 'ఈ కంకణం నా అదృష్టం కొద్దీ లభిస్తోంది. సందేహించడం ఎందుకు?' అనుకున్నాడు. కంకణాన్ని చూపించమని పులిని అడిగాడు. పులి కంకణాన్ని చూపించింది. 'నీవు క్రూర జంతువువి నిన్ను ఎలా నమ్మాలి?" అని బాటసారి ప్రశ్నించాడు.

బాటసారి ప్రశ్నకు పులి సమాధానంగా 'నేను వయసులో ఉన్నప్పుడు నిజంగా దుర్మార్గుణ్ణే. అనేక మంది మనుషులను, పశువులను చంపి పాపం చేశాను. ఒక పుణ్యాత్ముడు నా మీద దయతో 'జీవహింస మాని మంచి పనులు చేయమన్నాడు. అదీకాక నేను ముసలివాణ్ణి. పళ్లు, గోళ్లు లేవు. సత్తువలేదు. నన్ను నీవు ఎందుకు నమ్మవు? నీవు బీదవాడివని తలచి నీకు కంకణం దానం చేయాలనుకున్నాను. సందేహించకు. ఆ సరస్సులో స్నానం చేసి వచ్చి, బంగారు కంకణాన్ని తీసుకో' అని చెప్పింది.

అప్పుడు బాటసారి పులి మాటలు నమ్మి, సరస్సులో స్నానానికి దిగాడు. మొలబంటి బురదలో కూరుకుపోయాడు. పులి చూసి 'అయ్యో! బురదలో కూరుకు పోయావు. వచ్చి బయటకు తీస్తా'నని చెప్పి, అతడి దగ్గరకు వచ్చి, పట్టుకొని భక్షించింది.

**2. పాల్కురికి సోమన జీవిత విశేషాలను, కవితా గుణాలను వివరించండి.**

**జ.** పాల్కురికి సోమనాథుడు తెలుగు సాహిత్య చరిత్రలో 'శివ యుగమునకు' యుగకర్త. కాలం 13వ శతాబ్దం. జనగామ తాలూకా నేటి 'పాలకుర్తి' గ్రామంలో జన్మించాడు. తండ్రి 'విష్ణురామిదేవుడు', తల్లి 'శ్రియాదేవి', దీక్షాగురువు 'గురులింగాచార్యుడు'. శిక్షాగురువు 'కట్టకూరి పోతిదేవర'. సాహిత్య గురువు 'కరస్థలి విశ్వనాథయ్య'.

**వైదుష్యం:** ప్రామాణిక మత గ్రంథాలను రచించి, వీరశైవాన్ని పునరుజ్జీవింపజేశాడు. వీరశైవులు ఇతడిని భృంగీశ్వరుని అవతారంగా భావించారు. వారికి సోమన గురుపీఠం అయ్యాడు. భాష, భావం, రూపం, అన్ని విషయాల్లో నూతన పోకడలతో తన ప్రతిభను చాటుకున్నాడు. దేశభాషల్లో రచిస్తే శీఘ్రంగా ప్రచారం జరుగుతుందని భావించి, ద్విపదలో జానుతెనుగు భాషలో సులభంగా అర్థం అయ్యేలా తెలుగులో కావ్యాలు రచించాడు.

**రచనలు:** 'అనుభవసారము, బసవపురాణము, పండితారాధ్య చరిత్ర, వృషాధిపశతకము' తదితర రచనలు చేసి, తెలుగు సాహిత్యానికి ఎంతో గౌరవాన్ని కలిగించాడు.

**కవితా గుణాలు:** పాల్కురికి సోమనాథుడు మత ప్రచారం కోసం వాఙ్మయాన్ని సృష్టించినా, సాహిత్య మర్యాదలకు, కావ్య గౌరవానికి లోపం రాకుండా రమణీయ కళాఖండాలను లోకానికి అందించాడు.

**భాష:** పాల్కురికి తన రచనల్లోని భాష, ఛందస్సులను గురించి తెలుపుతూ, 'గద్య పద్య రచనల కంటే జాను తెనుగు సర్వ సామాన్యంగా ఉంటుందని చెప్పాడు. తన కవిత్వంలోని మాటలు తెలుగు మాటలని నిరసించవద్దనీ, వేద వాక్యాలుగా గౌరవించాలనీ చెప్పాడు.

సోమన ద్విపదలో రెండు కావ్యాలను రచించాడు. పోతన భక్తి తత్వానికి, శ్రీనాథుని నుడికార వర్ణనలకు, రాయల వర్ణనా పటిమకు సోమన కావ్యాలే మార్గదర్శకాలు. సోమన దేశి కవిత్వానికి దారి చూపిన గురువు.

**IV. కిందివాటిలో ఏదైనా ఒక ప్రశ్నకు 25 పంక్తుల్లో సమాధానం రాయండి** **1 × 8 = 8**

**1. 'శబ్దసందేశం'లో నాగమణి కుటుంబాన్ని విడిచి, జెడ్డా వెళ్లడానికి గల ఆర్థిక పరిస్థితులను రాయండి?**

**జ.** రాయలసీమలో బతికే ఒక పేద కుటుంబానికి చెందిన స్త్రీ నాగమణి. ఆమెకు భర్త, ముగ్గురు సంతానం ఉన్నారు. పెద్దకూతురు అనసూయ, రెండో కూతురు అలివేలు, కుమారుడు సత్తిబాబు. భర్తతో కలిసి కూలీ నాలీ చేస్తూ, వచ్చే గొర్రెతోక సంపాదనతో కుటుంబాన్ని నెట్టుకొస్తోంది.

**జెడ్డా వెళ్లడానికి గల ఆర్థిక పరిస్థితులు**

1. నాగమణిది పేద కుటుంబం. కూలీ సంపాదనతో రోజులు వెళ్లబుచ్చే సంసారం. ఏదైనా అవసరానికి డబ్బు కావాలంటే వారి దగ్గర ఉండేది కాదు. అందువల్ల జెడ్డా వెళ్లి డబ్బు సంపాదించుకొని వస్తే సంసార బాధలు తీరిపోతాయని భావించిన నాగమణి జెడ్డా వెళ్లింది.

2. నాగమణికి ముగ్గురు సంతానం. ముగ్గురూ పెరుగుతున్నారు. వారి అవసరాలూ పెరుగుతున్నాయి. అందుకు ఆదాయం అవసరం. కానీ, అది పెరిగే మార్గం ఆ గ్రామంలో లేదు. పిల్లల అవసరాలు తీర్చడానికి కావలసిన డబ్బు సంపాదించాలనే కోరికతో నాగమణి జెడ్డా వెళ్లడానికి నిర్ణయించుకుంది.

3. ఆమెకు ఇద్దరు ఆడపిల్లలు, ఒక మగపిల్లాడు. కూలితో వచ్చే సంపాదనతో వారికి సరైన తిండి పెట్టే అవకాశం కూడా లేదు. శరీరం నిండా కప్పుకోవడానికి బట్టలు కూడా లేవు. మంచి ఆహారం, మంచి బట్టలు కొనుక్కోవాలంటే డబ్బు కావాలి. అది వారి వద్ద లేదు. దాన్ని సంపాదించాలని నాగమణి జెడ్డాకు బయలుదేరింది.

4. నాగమణి నివసించే ఇల్లు పూరిగుడిసె. వాన కురిస్తే ఇంటి నిండా నీళ్లే. ఊళ్లో సంపాదించే డబ్బుతో మంచి ఇల్లు కట్టుకునే అవకాశం లేదు. అందుకని జెడ్డా వెళ్లి, డబ్బు సంపాదించి, మంచి ఇల్లు కట్టుకోవాలని నాగమణి ఉద్దేశం.

5. నాలుగేళ్లు గడిస్తే పెద్ద కూతురు అనసూయ పెద్దదవుతుంది. ఆ తరువాత అలివేలు. వారికి పెళ్లిళ్లు చేయాలి. అందుకవసరమైన డబ్బు ఆమె వద్ద లేదు. అవసరమైన సొమ్మును సంపాదించాలని నాగమణి జెడ్డా వెళ్లడానికి నిర్ణయించుకుంది. ఆమె నిర్ణయాన్ని ఇరుగు పొరుగు వాళ్లు ప్రోత్సహించారు. తన పెద్దమ్మ కొడుకు సౌదీలో ఉన్నాడు. మధ్యవర్తి పెద్దబ్బ నాయుడు అన్ని పనులు తాను చూసుకుంటానని చెప్పాడు. ఆమె భర్త కూడా వద్దని చెప్పలేదు. ఈ కారణాలవల్ల నాగమణి బొంబాయి వెళ్లి, అక్కడి నుంచి జెడ్డాకు వెళ్లింది.

ఆర్థిక పరిస్థితులు మనుషులను ఎలా నడిపిస్తాయో నాగమణి వృత్తాంతం తెలియజేస్తుంది.

2. **'పల్లెబడి' కథలోని ఉపాధ్యాయుడి పాత్రను వివరించండి?**

జ: 'పల్లెబడి' కథలోని ఉపాధ్యాయుడు చాలా పేద వ్యక్తి. నోట్లో చుట్ట, భుజం మీద రుమాలు, ఒక చేతిలో బరికె, మరో చేతిలో ధోవతి కుచ్చిళ్లు, మాసికలు వేసిన కమీజు, పొడవైన మీసం, ఎనిమిది రోజులుగా గీసుకోని గెడ్డం, జేబులో పళ్లు దోముకునే పుల్ల - ఇదీ పంతులు గారి ఆకారం. అతడు పొద్దున్నే బడికి వచ్చేవాడు. పిల్లలను ముఖాలు కడుక్కోవడానికి పంపించి, తాను కూడా వెళ్లేవాడు. అతడికి ఓర్పు ఎక్కువ. పిల్లలను ప్రేమగా చూసేవాడు. బడికి వచ్చిన వెంటనే పెంటయ్య గొడవ చేశాడని తెలిసినా దండించలేదు.

పంతులు కేవలం పాఠాలు చెప్పి వెళ్లేవాడు కాదు. బడికి రాని పిల్లల గురించి వాకబు చేసేవాడు. వారెందుకు రాలేదో తెలుసుకునేవాడు. అన్ని తరగతులకూ ఒకడే పంతులు కావడంవల్ల అన్ని పాఠాలనూ బోధించేవాడు. ఒకరితో 'క' గుణింతం, ఒకరితో పద్యాలు అప్పజెప్పించుకునేవాడు. పాఠ్యాంశాలు అందరికీ అర్థమయ్యే రీతిలో చెప్పేవాడు. చదువుకోకుండా కాలం వెళ్లబుచ్చేవారిని బెదిరించేవాడు.

తొమ్మిది గంటలకు పిల్లలను తిండికి పంపించేవాడు. తిరిగి వాళ్లు అటూ, ఇటూగా పది గంటలకు వచ్చేవారు. పాత ఉత్తరాలను చూపించి, ఎలా రాయాలో వారికి చెప్పేవాడు. పిల్లలు భోజనాలకు వెళ్లిన తరువాత శాయన్నకు గింజల గురించి రాసి యిచ్చాడు. ఎల్లారెడ్డికి ఉత్తరం రాసి ఇచ్చాడు. పంతులంటే కేవలం పిల్లలకు పాఠాలు చెప్పడమే కాదు, అవసరమయినప్పుడు ఊళ్లోవాళ్లకు సహాయం చేయాలనేది ఆయన తత్వం.

మధ్యాహ్నం భోజనాలైన తరువాత చూచిరాతలు రాయించేవాడు. లెక్కలు చేయించడం, ఎక్కాలు చదివించడం వంటివి చేయించేవాడు. కొంత మంది పిల్లలు మోసం చేసి, దోసకాయల కోసం వెళితే, వారిని చితకదన్ని బడికి తెచ్చేవాడు. చీకటి పడగానే దీపం ముట్టించేవారు. పిల్లలంతా 'దీపం జ్యోతి పరబ్రహ్మం, సరస్వతీ ప్రార్థన' చదివి పంతులుకు నమస్కారం చేసి ఇళ్లకు చేరుకునేవారు. పంతులు చిత్తశుద్ధి కలవాడు. ఏ పిల్లవాడికి ఎలా చెబితే అర్థమవుతుందో అలానే చెప్పేవాడు. అటువంటి ఉపాధ్యాయులు తక్కువే ఉంటారు.

**V. కిందివాటిలో ఏవైనా రెండింటికి సందర్భ సహిత వ్యాఖ్యలను రాయండి? 2 × 3 = 6**

**1. హాయి మీర నెమరు వేయుచుండే**

**పరిచయం:** ఈ వాక్యం జాషువా రచించిన ఖండ కావ్య సంపుటి- ఆరవ భాగం నుంచి గ్రహించిన 'సంక్రాంతి' అనే పాఠ్య భాగంలోనిది.

**సందర్భం:** సంక్రాంతి మనుషులకు, జంతువులకు విశ్రాంతినిచ్చే పండుగ. ఎద్దులు తమ మెడలపై నాగలి కాడిని మోయవలసిన అవసరం తీరి, హాయిగా తిన్న తిండిని నెమరు వేసుకుంటూ ఉంటాయని కవి సంక్రాంతిని వర్ణిస్తూ చెప్పిన సందర్భంలోనిది.

**అర్థం:** సుఖంగా, తిన్న తిండిని తిరిగి నోట్లోకి తెచ్చుకొని నములుతాయి.

**వ్యాఖ్య:** ఎద్దులు సంక్రాంతికి సుఖంగా విశ్రాంతి తీసుకుంటున్నాయని కవి వర్ణించాడు.

**2. పురోడాశమిది కుక్కకర్హ మగునే**

**పరిచయం:** ఈ వాక్యం నన్నయ రచించిన ఆంధ్ర మహాభారతంలోని ఆది పర్వం - షష్ఠాశ్వాసం నుంచి గ్రహించిన 'స్నేహాభిషేకం' అనే పాఠం లోనిది.

**సందర్భం:** ఉత్తమ క్షత్రియుడు అనుభవింపదగిన అంగరాజ్యం, కర్ణునకు తగదని చెప్పి, దానికి దృష్టాంతంగా 'పురోడాశమును తినడానికి కుక్కకు అర్హత ఉండదు కదా' అని, భీముడు కర్ణుని పరిహసించిన సందర్భంలోనిది.

**అర్థం:** పురోడాశము అంటే యజ్ఞకర్త కోసం చేసిన పిండివంట. దాన్ని కుక్క తినడం తగదు.

**వ్యాఖ్య:** పురోడాశము తినడానికి యజ్ఞకర్తకు మాత్రమే అర్హత ఉంది. కుక్కకు ఆ అర్హత లేనట్లే అంగరాజ్యాన్ని అనుభవించే అర్హత క్షత్రియుడు కాని కర్ణునికి లేదని భీముని నిర్ధారణ.

**3. చదువులలో మర్మమెల్ల చదివితి తండ్రి**

**పరిచయం:** ఈ వాక్యం బమ్మెర పోతన రచించిన ఆంధ్ర మహా భాగవతము లోని సప్తమ స్కందం నుంచి గ్రహించబడిన 'ప్రహ్లాదుని విద్యాభ్యాసం' అనే పాఠంలోనిది.

**సందర్భం:** ప్రహ్లాదుని విద్యాబలమును చూపించమని తండ్రి హిరణ్యకశిపుడు అడిగాడు. అప్పుడు ప్రహ్లాదుడు గురువులు తనను చక్కగా చదివించారని, ఎన్నో శాస్త్రాలు తాను చదివాననీ, చదువులలోని రహస్యాన్ని అంతా తెలుసుకున్నానని తండ్రికి చెప్పిన సందర్భంలోనిది.

**అర్థం:** తండ్రీ! చదువులలోని రహస్యమును అంతా చదివాను.

**వ్యాఖ్య:** విష్ణుమూర్తిని గురించి తెలుసుకోవడమే చదువుల్లోని రహస్యమని ప్రహ్లాదుడి భావం.

**4. రేపు పూసే చిగురుకి, సరికొత్త ఊపిరివి.**

**పరిచయం:** ఈ వాక్యం అలిశెట్టి ప్రభాకర్ రచించిన 'అలిశెట్టి ప్రభాకర్ కవిత' అనే కవితా సంకలనం నుంచి గ్రహించబడిన 'ఉచ్ఛ్వాస' అనే పాఠంలోనిది.

**సందర్భం:** ఈ కవితలో కవి మనిషి ఆశావహ దృక్పథంతో జీవించాలని చెబుతూ మనిషికి ప్రతిగా విత్తనాన్ని చూపుతాడు. 'విత్తనం' తరువాత కాలంలో చెట్టుకు వచ్చే చిగురుకు ప్రాణవాయువు వంటిదని చెప్పిన సందర్భంలోనిది.

**అర్థం:** మరునాడు ఉదయించే చిగురుకు ప్రాణవాయువు.

**వాఖ్య:** విత్తనం చక్కగా మొలిచి చెట్టుగా అయితేనే తరువాత దానికి చిగుళ్లు వస్తాయి. మనిషి ఆశావహంగా జీవిస్తేనే అభివృద్ధి చెందుతాడని ప్రభాకర్ ఆశయం.

**VI. కిందివాటిలో ఏవైనా రెండింటికి సందర్భ సహిత వ్యాఖ్యలను రాయండి? 2 × 3 = 6**

**1. ఆహా! అదియెంత గొప్ప శాస్త్రము?**

**పరిచయం:** ఈ వాక్యం కనుమర్తి వరలక్ష్మమ్మ రచించిన 'శారద లేఖలు' ద్వితీయ సంపుటి నుంచి గ్రహించబడింది.

**సందర్భం:** గృహిణి నిద్ర నుంచి లేచి, గృహ కృత్యములను నెరవేర్చి, వంటను ప్రారంభిస్తుంది. ఆ వంట గొప్ప శాస్త్రమని, ఆ శాస్త్రంలో గృహిణికి ఎంతో అనుభవం, నేర్పు ఉంటాయనీ వరలక్ష్మమ్మ చెప్పిన సందర్భం.

**అర్థం:** అది అద్భుతమైన శాస్త్రము.

**వ్యాఖ్య:** వంట గొప్ప శాస్త్రమని, ఆ విద్యలో గృహణికి గల నేర్పు గొప్పదని భావం.

**2. కొఱవిమాలిన శంకలు తెచ్చుకొని భోజనమును మానుకొనవచ్చునా?**

**పరిచయం:** ఈ వాక్యం చిన్నయసూరి రచించిన నీతిచంద్రిక నుంచి గ్రహించిన 'మిత్రలాభము' అనే పాఠ్య భాగంలోనిది.

**సందర్భం:** నిర్జనారణ్యమునున్న నూకలను చూసిన కపోతరాజు వాటిని తినడానికి వెళ్లవద్దని, అడవిలో నూకలు ఉండటం అసహజమని చెప్పగా, వృద్ధపావురం తెలివిలేని అనుమానాలతో భోజనమును మానుకోవడం వెర్రితనమని చెప్పిన సందర్భం.

**అర్థం:** పనికిరాని అనుమానాలతో భోజనమును మానుకోవచ్చునా?

**వ్యాఖ్య:** భోజనము లభించినపుడు విషయంలో పనికిరాని అనుమానాలు తగవని భావం.

**3. తెలుగులో చదవడమేమిటని ముక్కు విరిస్తే ప్రయోజనం లేదు.**

**పరిచయం:** ఈ వాక్యం అందె వేంకటరాజము రాసిన 'మనతెలుగు' అనే వ్యాసంలోనిది.

**సందర్భం:** ఎన్నో సాంకేతిక లోపాలున్న, కఠినమైన అర్థాలు గల పదాలతో తెలుగులో చదవడం బాగులేదని నిరసించరాదని వ్యాస రచయిత హితవు చెప్పిన సందర్భంలోనిది.

**అర్థం:** తెలుగులో చదవడం కూడదని నిరసిస్తే ఉపయోగం లేదు.

www.eenadupratibha.net

**4. కంపెనీ ఏదీ పెట్టనూ లేదు. అది దివాళా తియ్యనూలేదు.**

**పరిచయం:** ఈ వాక్యం తూమాటి దొణప్ప రచించిన 'తెలుగులో కొన్ని జననిరుక్తులు' అనే పాఠంలోనిది.

**సందర్భం** 'ఆరుబత్తుల కంపెనీ' అనే శబ్దం నిజం కాదు. అది 'అర్బత్‌నాట్ కంపెనీ' అని వ్యాస రచయిత వివరణ. ఆరుగురు బత్తులు కలసి అసలు కంపెనీయే పెట్టలేదని, వారు దివాలా తీయనూలేదని ఆ శబ్దం అసలు స్వరూపాన్ని వ్యాస రచయిత తెలిపిన సందర్భం.

**అర్థం:** కంపెనీ లేదు. దివాళా లేదు.

**VII. కిందివాటిలో ఏవైనా రెండింటికి సంక్షిప్త సమాధానాలు రాయండి? 2 × 2 = 4**

**1. కర్ణుని అవమానాన్ని దుర్యోధనుడు ఎలా తొలగించాడు?**

**జ.** కర్ణుడు అర్జునుడితో ద్వంద్వ యుద్ధానికి సిద్ధపడ్డాడు. అర్జునుడు రాజధర్మం కలవాడు కాబట్టి, కర్ణుడు కూడా రాజు అయి ఉండాలని కృపాచార్యుడు అన్నాడు. కర్ణునికి రాజ్య అర్హత కల్పించడం కోసం, దుర్యోధనుడు కర్ణునకు అంగరాజ్యమునిచ్చి పట్టాభిషేకం చేశాడు. అతడి అవమానాన్ని తొలగించాడు.

**2. పోతన కవితారీతులను సమీక్షించండి?**

**జ.** పోతన తెలుగు, సంస్కృతాలు తెలిసిన వారిని తన కవిత్వంతో మెప్పించాడు. పోతన పద్యాలు ప్రజల నాలుకలపై నాట్యం చేస్తాయి. అతడు తన భాగవతంలో భక్తి వేదాంతాలను సమానంగా వివరించాడు. ఆయన కవిత్వం సహజ సుందరంగా, నవరసభరితంగా ఉంటుంది.

శబ్దాలంకారాలను హృద్యంగా ప్రయోగించడం పోతన ప్రత్యేకత. తెలుగు దేశంలో పోతన భాగవత పద్యం ఒక్కటైనా రానివాడు ఉండడు.

**3. మిత్రుడి లక్షణములను తెలపండి.**

**జ.** మిత్రుడు పాపకార్యముల నుంచి రక్షిస్తాడు. మేలు కలిగించే పనులు చేసేలా చూస్తాడు. రహస్యాలను దాస్తాడు. సద్గుణాలను పెంచుతాడు. ఆపత్కాలంలో విడిచిపెట్టడు. లేని సమయంలో అవసరమైన దాన్ని సమకూర్చుతాడు. ఇవీ మిత్రుడి లక్షణాలు.

**4. తోకచుక్కను గురజాడ భావించిన విధమును తెలపండి?**

**జ.** తోకచుక్కను గురజాడ 'సంఘ సంస్కరణ ప్రయాణపు పతాకం'గా భావించారు. దేవతాస్త్రీలు ఆడుకునే కలువపువ్వు అన్నారు. ఆకాశ భవనంలో జాడ తెలియని ఒకవింత అన్నారు. దానివల్ల కీడు కలుగుతుందన్నవారు మంద బుద్ధులని మందలించారు. తోకచుక్క రవ్వంత కూడా దుఃఖాన్ని కల్గించలేదన్నారు. తోకచుక్క బ్రహ్మ సృష్టిలో నేర్పునకు హద్దు అని చెప్పారు. భూమికి దూరపు బంధువని, అది మానవులకు కన్నుల పండుగ చేయడానికి 70 లేదా 80 సంవత్సరాలకు ఒకసారి వస్తుందన్నారు.

**VIII. కిందివాటిలో ఏవైనా రెండింటికి సంక్షిప్త సమాధానాలు రాయండి? 2 × 2 = 4**

**1. దుఃఖ భాగులెవరు?**

**జ.** ఈర్ష్యాళువు, జుగుప్సావంతుడు, నిస్సంతోషి, క్రోధనుడు, నిత్యశంకితుడు, పరభాగ్యోపజీవి అనే ఆరుగురిని దుఃఖ భాగులంటారు.

**2.** **ఆంధ్రమహిళా సభను గురించి వివరించండి?**

**జ.** దుర్గాబాయి మొదట మద్రాసులో బాలికలకు 'బృందావనము' అనే చిన్న సంఘాన్ని స్థాపించింది. దాన్నే ఆమె ఆంధ్ర మహిళా సభగా రూపొందించింది. అది కొద్దికాలంలోనే పెద్ద సంస్థగా మారి, స్త్రీలకు కల్ప తరువుగా విరాజిల్లింది. ఇక్కడ స్త్రీలు ఉన్నతవిద్యను అభ్యసించేందుకు అన్ని సౌకర్యాలూ ఉన్నాయి. సంగీతం, కుట్లు వంటివేకాకుండా, గృహపరిశ్రమలకు, లలితకళలకు ఈ సభ వేదికగా మారింది. దేశం లోని రాజులు, జమీందార్లు, వ్యాపారులు, ధనవంతులు ఆంధ్రమహిళా సభకు విరాళాలు ఇచ్చారు. ఇది శాఖోపశాఖలుగా విస్తరించింది.

**3.** **ఆ రోజుల్లో రాత్రి ప్రయాణానికి తీసుకునే జాగ్రత్తలేమిటి?**

**జ.** తిరుమల రామచంద్ర బాల్యంలో బండ్లపై రాత్రి ప్రయాణాలు చేసేవారు. ఆ సమయంలో ఆరిపోయిన దివిటీలు దగ్గరుంచుకునేవారు. అడవి జంతువులు వస్తే, వాటిని అంటించి బెదరగొట్టేవారు. ఒకటి రెండు బల్లేలు కూడా ఉంచేవారు. రాత్రిభోజనం చేసి బయలుదేరేవారు. ఎడ్లు ఎంత నెమ్మదిగా నడిచినా, వారు తెల్లవారేసరికి గమ్యం చేరుకునేవారు.

**4.** **గడియారం వారి సాహిత్య సేవను వివరించండి?**

**జ.** గడియారం రామకృష్ణశర్మ ఆంధ్రమహా సభలను నిర్వహించారు. తెలుగు భాషపట్ల చైతన్యాన్ని కలిగిం చారు. ఆంధ్రసారస్వత పరిషత్ స్థాపనకు కృషి చేశారు. పరిషత్ ద్వారా తెలుగు భాషా బోధనకు కృషి చేశారు. 'సుజాత' అనే పత్రికను నడిపారు. ఆంధ్రసాహిత్య అకాడమీ అధ్వర్యంలో 'మెకంజీ కైఫీయత్తు'లను పరిశీలించి, ఎత్తిరాయించారు. 'తెలంగాణ శాసనాలు' రెండో సంపుటిని ప్రచురించారు. రన్న కవి కన్నడ రచన 'గదాయుద్ధాన్ని' ఆంధ్రీకరించారు. విద్యారణ్య చరిత్రను, తన ఆత్మకథ 'శతపత్రం'ను రచించారు.

**IX.** **కిందివాటిలో ఒకదాన్ని గురించి లేఖ రాయండి?** **1 × 5 = 5**

1. **ఉద్యోగం కోసం కలెక్టరుకో లేఖ.**

శ్రీకాకుళం,

11. 02. 2014.

శ్రీయుతులు గౌరవనీయులు

జిల్లా కలెక్టరుగారికి,

శ్రీకాకుళం జిల్లా

శ్రీకాకుళం

**విషయం:** జిల్లారెవిన్యూ కార్యాలయంలో గుమస్తా ఉద్యోగం కోసం విజ్ఞప్తి

**ఉటంకింపు:** 08-02-2014, ఈనాడు పత్రికలో వెలువడిన/ ప్రచురించబడిన ప్రకటన ప్రకారం.

**అయ్యా,**

తేదీ 08-02-2014 నాటి ఈనాడు దినపత్రికలో మీరిచ్చిన ఉద్యోగ ప్రకటన చూశాను. దరఖాస్తు పంపు తున్నాను. ఆ ఉద్యోగానికి కావలసిన విద్యార్హతలు, తాత్కాలిక అనుభవం నాకు ఉన్నాయి. కంప్యూటర్ పరి జ్ఞానం, ప్రైవేటు సంస్థలో పనిచేసిన అనుభవం కూడా ఉన్నాయి. అవసరమైన ధ్రువీకరణ పత్రాలన్నిటినీ దర ఖాస్తుతో జతపరిచాను.

దీనికి అవసరమైన రూ.150 చలానా జత చేశాను. ప్రభుత్వానికి విధేయుడనై, కష్టపడి పని చేస్తాను. నాకు ఉద్యోగ అవకాశం ఇప్పించ ప్రార్థన.

కృతజ్ఞలతో,

**మీ విశ్వసనీయుడు**

×××××××××

**జత చేసిన పత్రాలు**

1. విద్యార్హతల ధ్రువీకరణ పత్రాలు
2. అనుభవ పత్రం
3. చలానా, కులధ్రువీకరణ పత్రం
4. మార్కుల పత్రాలు

- × -

**2. నీ చదువును గురించి నీ తల్లిదండ్రులకు లేఖ.**

విజయవాడ

11-02-2014

ప్రియమైన అమ్మకూ, నాన్నకు

నమస్కారములు. నేను ఇక్కడ క్షేమం. మీరంతా క్షేమమని భావిస్తాను. చెల్లి, తమ్ముడు బడికి వెళుతున్నారని తలుస్తాను. తాతా, నాయనమ్మలకు నమస్కారాలు. నేను చదివే కళాశాల బాగుంది. నేను శ్రద్ధగా చదువుతున్నాను. వారం, వారం పరీక్షలు నిర్వహిస్తున్నారు. నాకు మంచి మార్కులు వస్తున్నాయి. మెస్‌లో భోజనం బాగుంది. ప్రతీ ఆదివారం ఎమ్‌సెట్ కోచింగ్ ఇస్తున్నారు. మంచి గ్రంథాలయముంది. అక్కడ మాకవసరమైన పుస్తకాలు ఇస్తారు. నా చదువు గురించి మీరు బెంగపడనవసరం లేదు.

మొన్న సెలవులకు బాబాయి గారింటికి వెళ్లాను. మన గ్రామంలో నా స్నేహితులను అడిగానని చెప్పండి. నేను చదువుపై శ్రద్ధ పెడతాను. ఉంటాను.

మీ కుమారుడు

నీలపు శ్రీనివాసరావు

**చిరునామా:**

**నీలపు శ్రీనివాసరావు**

**×××××××××××**

**×××××××××**

**××××××××××**

www.eenadupratibha.net

**X. కిందివాటిలో ఏవైనా నాలుగింటిని విడదీసి సంధిపేర్లు, సూత్రాలు రాయండి** 4 × 3 = 12

1. దేవాలయము = దేవ+ఆలయము = సవర్ణదీర్ఘసంధి

**సూత్రం:** అ, ఇ, ఉ, ఋలకు సవర్ణములైన అచ్చులు పరమైనప్పుడు వాటి దీర్ఘములు ఏకాదేశమగును.

2. హితోక్తి= హిత+ఉక్తి = గుణసంధి

**సూ:** అకారమునకు ఇ, ఉ, ఋలు పరమైనపుడు క్రమంగా ఏ, ఓ, అర్‌లు ఏకాదేశమగును.

3. వనౌషధి = వన+ఓషధి = వృద్ధిసంధి

**సూ:** అకారమునకు ఎ, ఐలు పరమైన ఐకారము, ఓ, ఔలు పరమైన ఔకారము ఏకాదేశమగును.

4. అభ్యుదయము = అభి+ఉదయము = యణాదేశసంధి

**సూ:** ఇ, ఉ, ఋలకు, అసవర్ణములైన అచ్చులు పరమైనపుడు క్రమముగా య, వ, రలు ఏకాదేశమగును.

5. ఒకానొక = ఒక+ఒక = అత్వసంధి

**సూ:** అత్తునకు సంధి బహుళముగానగు

6. మఱేమి = మఱి+ఏమి = ఇత్వసంధి

**సూ:** ఏమ్యాదులు ఇత్తునకు సంధి వైకల్పికముగానగు

7. రారుగదా = రారు+కదా = గసడవాదేశ సంధి

**సూ:** ప్రథమ మీది పరుషములకు గ, స, డ, ద, వలు బహుళంగానగు

8. మీయిల్లు = మీ+ఇల్లు = యడాగమ సంధి

**సూ:** సంధిలేని చోట స్వరంబు కంటే పరమైన స్వరమునకు యడాగమంబగు

**XI. కిందివాటిలో ఏవైనా నాలుగింటికి విగ్రహవాక్యాలు రాసి, అవి ఏ సమాసాలో పేర్కొనండి?** 4 × 2 = 8

1. మధుర వచనం = మధురమైన వచనం - విశేషణ పూర్వపద కర్మధారయం
2. ముల్లోకములు = మూడు అయిన లోకములు - ద్విగు సమాసం
3. నెలతాల్పు = నెలను దాల్చిన వాడు - ద్వితీయా తత్పురుష
4. దొంగభయము = దొంగ వలన భయము - పంచమీ తత్పురుష
5. పాదపద్మము = పద్మము వంటి పాదము - ఉపమాన ఉత్తరపద కర్మధారయం
6. చిగురుకేలు = చిగురువంటి కేలు - ఉపమాన పూర్వపద కర్మధారయం
7. విద్యాధికుడు = విద్య చేత అధికుడు - తృతీయా తత్పురుష
8. వింధ్య పర్వతం = వింధ్య అనే పేరు గల పర్వతం - సంభావనా పూర్వపద కర్మధారయం

**XII. కిందివాటిలో ఏవైనా అయిదింటికి సొంత వాక్యాలు రాయండి?** 5 × 1 = 5

1. తలవంచుకొను = గురువుల వద్ద తలవంచుకొనడం సంస్కారం.
2. పరోపకారము = మనిషికి పరోపకారము కీర్తిని తెస్తుంది.
3. విద్యాబుద్ధులు = మంచి గురువు వద్ద విద్యాబుద్ధులు నేర్వాలి.

4. కొంటమాలిన = కొంటమాలిన పనులు అనర్థాలను తెస్తాయి.

5. ప్రత్యక్షం = భక్తునికి భగవంతుడు ప్రత్యక్షం కాగలడు.

6. మతిభ్రమణం = మతిభ్రమణం చెందిన మనిషి మంచి ఆలోచనలు చేయలేడు.

7. అనర్గళం = అనర్గళంగా ఉపన్యసించడం గొప్పకళ.

8. స్వర్గసుఖములు = కష్టించి పనిచేసిన వారికి భూమి మీదనే స్వర్గసుఖములు కలుగుతాయి.

9. గాఢాలింగనం = బాల్య స్నేహితులు కలుసుకుంటే గాఢాలింగనం చేసుకొంటారు.

10. అన్నవస్త్రాలు = జనులందరి శ్రమా అన్నవస్త్రాల కోసమే కదా!

**XIII. కిందివాటిలో ఒక దాన్ని గురించి వ్యాసం రాయండి.** **1 × 5 = 5**

1. **పర్యావరణం – పరిరక్షణ** 2. **మాతృభాష** 3. **నీకు నచ్చిన కవి**

## పర్యావరణం - పరిరక్షణ

వర్తమానంలో పర్యావరణ పరిరక్షణ అనేది ప్రతి ఒక్కరి బాధ్యతగా గుర్తెరగాలి. మానవుడు తన తెలివితేటలను సక్రమంగా వినియోగించలేకపోవడమే పర్యావరణ కాలుష్యానికి ప్రధాన కారణం. మానవుడు తన జీవితాన్ని సుఖమయం చేసుకోవాలనే తలంపుతో ప్రకృతి సంపదను, వనరులను నాశనం చేస్తూ, గాలినీ, నీటినీ, భూమినీ కలుషితం చేస్తున్నాడు. తన ముప్పును తానే కొని తెచ్చుకుంటున్నాడు.

**వాతావరణ కాలుష్యం:** భూగోళాన్ని ఆవరించి ఉన్న గాలిని శాస్త్రవేత్తలు 'వాతావరణం' అంటారు. వాతావరణంలో ఆక్సిజన్, నైట్రోజన్ వంటి వాయువులు ఉంటాయి. రకరకాల పరిశ్రమల నుంచీ, వాహనాల నుంచీ వెలువడే రసాయనాలు, పొగ ఓజోన్ పొరకు రంధ్రాలు చేస్తున్నాయి. దీంతో అతినీలలోహిత కిరణాలు సరాసరి జంతువులు, మానవులపై ప్రసరిస్తున్నాయి. ఫలితంగా కేన్సర్, చర్మవ్యాధులు వంటి రకరకాల రోగాలు మనిషిని నాశనం చేస్తున్నాయి. వాతావరణ కాలుష్యం వల్ల ప్రకృతి వనరులు నాశనమవుతున్నాయి.

**జల కాలుష్యం :** మానవుడి నిర్లక్ష్యం వల్ల, పరిశ్రమల నుంచి వెలువడే రసాయనాల వల్ల జలవనరులు కాలుష్య కాసారాలుగా మారుతున్నాయి. మన దేశంలోని పెద్ద నదులైన గంగ, యమున, గోదావరి, కృష్ణ తదితర నదులన్నీ ఎంతో కొంత కాలుష్యానికి గురవుతూనే ఉన్నాయి. దీనివల్ల సర్వ రోగాలకూ ఆవకాశమేర్పడుతోంది. కాబట్టి, జల సంరక్షణ తక్షణ అవసరం.

**శబ్ద కాలుష్యం:** భారీ యంత్రాలు, వాహనాలు, ఫ్యాక్టరీలు మానవులకు పెనుముప్పుగా పరిణమించాయి. ఫలితంగా వినికిడి శక్తి తగ్గిపోతున్నది. చిరాకు, అలసట ఎక్కువ అవుతున్నాయి. శబ్దకాలుష్యం వల్ల బి.పి. పెరగడం, వాంతులు రావటం వంటి చిక్కులు సంభవిస్తున్నాయి.

**పర్యావరణ పరిరక్షణ చర్యలు:** 1. మొక్కలను బాగా పెంచాలి. 2. చెత్తా చెదారం వేయడం, మలమూత్రాల విసర్జన వంటివి నీటివనరుల వద్ద చేయరాదు. 3. ధ్వని నియంత్రణ అవసరం. 4. క్రిమిసంహారక మందులు పరిమితంగా వాడుకొని సేంద్రియ ఎరువుల వినియోగం పెంచాలి. 5. వివిధ రకాల కాలుష్యాలను నివారించాలి.

ఇది వ్యక్తి సమస్యకాదు. ప్రపంచ సమస్య. 1986లో మనదేశం పర్యావరణ చట్టాన్ని చేసింది. దాన్ని అతిక్రమించిన వారిని కఠినంగా శిక్షించే ఏర్పాటు చేసింది.

ప్రజలంతా పర్యావరణ పరిరక్షణకు నడుం బిగించాల్సిన సమయమిదే!

**XIV. కింది ఆంగ్ల వాక్యాలను తెలుగులోనికి అనువదించండి** 1 × 5 = 5

1. Take Care of Your Health?

జ: నీ ఆరోగ్యాన్ని జాగ్రత్తగా కాపాడుకో

2. Never Try to Board a Running Bus?

జ: కదులుతున్న బస్సును ఎప్పుడూ ఎక్కేప్రయత్నం చేయకూడదు.

3. Mahatma Gandhi was born at Porubundar?

జ: మహాత్మా గాంధీ పోరుబందర్‌లో పుట్టాడు.

4. Writing was known in India over 4,000 Years ago.

జ: భారతదేశంలో నాలుగువేల సంవత్సరాల క్రితమే రాయడం తెలుసు.

5. Some students came late to the class.

జ: కొంతమంది విద్యార్థులు తరగతికి ఆలస్యంగా వచ్చారు.

(లేదా)

**కింది పేరాను చదివి, ప్రశ్నలకు సమాధానాలను రాయండి.**

ఓన గుంటలు ఆటను ఓమన గుంటలు, వామన గుంటలు అనికూడా అంటారు. ప్రాచీన కావ్యాల్లో కూడా ఈ ఆటను గూర్చిన ప్రస్తావనలు కనిపిస్తాయి. దక్షిణ భారతమంతా ఈ ఆట వాడుకలో ఉంది. ఓన గుంటలు ఆటను ఇద్దరు లేదా ముగ్గురు ఆడవచ్చు. ఓనగుంటలు పీటను చెక్కతో చేస్తారు. ఇది పొడవుగా ఉండి రెండుగా విభజించడానికి, తెరవటానికి, యూయటానికి వీలుగా ఉంటుంది. ఈ ఆటలో చింతగింజలు లేదా కుంకుడుగింజలు ఉపయోగిస్తారు. పీటలో ఉన్న చిన్న చిన్న గుంటలను ఇళ్లు అని కూడా వ్యవహరిస్తారు. రెండువైపులా ఏడు చొప్పున 14 గుంటలుంటాయి.

ప్రశ్నలు:

1. **ప్రాచీన కావ్యాల్లో ఏ ఆటను గురించి ప్రస్తావించారు?**

జ: ప్రాచీన కావ్యాల్లో ఓనగుంటలు ఆటను గురించి ప్రస్తావించారు.

2. **ఓనగుంటలు ఆటను ఎందరు ఆడవచ్చు?**

జ: ఓనగుంటలు ఆటను ఇద్దరు లేదా ముగ్గురు ఆడవచ్చు.

3. **ఓనగుంటలు పీటను దేనితో తయారు చేస్తారు?**

జ: ఓనగుంటలు పీటను చెక్కతో చేస్తారు.

4. **ఓనగుంటలు పీటలో ఎన్ని గుంటలుంటాయి?**

జ: ఓనగుంటలు పీటలో రెండువైపులా ఏడు చొప్పున 14 గుంటలుంటాయి.

5. **ఓనగుంటలు ఆటను ఏ గింజలతో ఆడతారు?**

జ: ఓనగుంటలు ఆటను చింత గింజలు లేదా కుంకుడు గింజలతో ఆడతారు.

**XV.** కింది ప్రశ్నలకు సరైన సమాధానాలను గుర్తించండి? 5 × 1 = 5

1. 'ప్రహ్లాదుని విద్యాభ్యాసము' పాఠ్యాంశం ఏ గ్రంథంలోనిది? (ఇ)

   అ) వాల్మీకి రామాయణము ఆ) సుభాషిత రత్నావళి

   ఇ) శ్రీమదాంధ్ర భాగవతం ఈ) శ్రీమదాంధ్ర మహాభారతం

2. ఏనుగు లక్ష్మణకవి రచించిన గ్రంథం (ఆ)

   అ) మహాప్రస్థానం ఆ) సూర్యశతకం ఇ) విశ్వంభర ఈ) ముత్యాలసరాలు

3. గురజాడ జన్మించిన సంవత్సరం (ఆ)

   అ) 1910 ఆ) 1862 ఇ) 1890 ఈ) 1905

4. 'సంక్రాంతి' ఖండిత రచయిత (అ)

   అ) జాషువా ఆ) శ్రీశ్రీ ఇ) సి. నారాయణరెడ్డి ఈ) గడియారం

5. 'హితోపదేశము'ను రచించిన వారు (అ)

   అ) నారాయణ పండితుడు ఆ) చిన్నయసూరి

   ఇ) విష్ణుశర్మ ఈ) అర్బత్‌నాట్

**XVI.** కింది వాటిని జతపరచండి 5 × 1 = 5

| | |
|---|---|
| a) మిత్రలాభము | (ఇ) అ) తిరుమల రామచంద్ర |
| b) శారదలేఖలు | (ఈ) ఆ) అందె వేంకటరాజము |
| c) శబ్దసందేశం | (ఉ) ఇ) పరవస్తు చిన్నయసూరి |
| d) రోడ్డుకు అడ్డంగా పడుకున్న పులి | (అ) ఈ) కనుమర్తి వరలక్ష్మమ్మ |
| e) మన తెలుగు | (ఆ) ఉ) మధురాంతకం రాజారాం |

**-భమిడిపాటి గౌరీశంకర్**